విశాలాంధ్ర
కృష్ణా జిల్లా

వలంటీర్ల వ్యవస్థతో గడప వద్దకే సంక్షేమ సేవలు : ఎమ్మెల్యే అనిల్

విశాలాంధ్ర-కూచిపూడి : సీఎం వైఎస్ జగన్ పాలనలో ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థతో సంక్షేమ పథకాల సేవలు ఇంటి ముంగిటికే సకాలంలోచేరుతున్నాయని ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. వలంటీర్లు ఎండనక, వాననక, చలిగాలులను సైతం తట్టుకుంటూ అర్ధరాత్రి 12 గంటలకి తలుపు తట్టిప్రతినెలా ఫస్ట్ తారీఖున వైయస్సార్ పింఛన్ కానుక ఇవ్వటమే దీనికి నిదర్శనమని పేర్కొన్నారు. స్థానిక మండవ జానకి రామయ్య సులోచన క్షేత్రయ్య కళ్యాణ మండపంలో శనివారం వలంటీర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వలంటీర్లకు చేదోడు వాదోడుగా ఉండే విధంగా ప్రతి గ్రామానికి ముగ్గురు కన్వీనర్లను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని వివరించారు. జనవరి నెల నుంచి మండలంలో 266 మందికి నూతనంగా పెన్షన్లు వస్తున్నాయని ఈ నెల నుంచి రూ.2,750 వృద్ధాప్య పెన్షన్‌గా అందజేస్తారన్నారు. సంక్షేమ పథకాల పంపిణీ, గడపగడపకు వెళ్లి ఆయా కుటుంబ సభ్యుల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని వారికి ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలను అందించేందుకు నిత్యంచేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఈ వ్యవస్థ పై ప్రతిపక్షాలు చేస్తున్న వ్యాఖ్యలు దయ్యాల వేదం వల్లించినట్టు ఉన్నాయని విమర్శించారు. ఏటా వీరి సేవలను గుర్తించి మూడు విభాగాలలో నగదు బహుమతులు అందజేస్తు ప్రోత్సాహిస్తున్న విషయాన్ని కూడా ప్రస్తావించారు.

ఏఐటీయూసీ నాయకులు చిన్నయ్య మృతి

నివాళులర్పించిన సీపీఐ నాయకులు అక్కినేని వనజ, దోనేపూడి శంకర్, నార్ల వెంకటేశ్వరరావు

విశాలాంధ్ర-గన్నవరం : సీపీఐ గన్నవరం నియోజకవర్గ కౌన్సిల్ సభ్యులు ఏఐటీయూసీ, ఏఐవైఎఫ్ నాయకులు అలవాల చిన్నయ్య (35) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. చిన్నయ్య కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో శనివారం ఉదయం 5 గంటలకు మృతి చెందారు. ఆయనకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. చిన్నయ్య ఏఐటీయూసీ, ఏఐవైఎఫ్ పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని పార్టీ ఉన్నతికి కృషి చేశారు. ఆయన మృతదేహానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు అక్కినేని వనజ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దోనెపూడి శంకర్, జిల్లా కార్యదర్శి నార్ల వెంకటేశ్వరరావు, జిల్లా సహాయ కార్యదర్శి టి తాతయ్య, రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ముక్కమాల ఉమామహేశ్వరరావు ఆయన మృతదేహాన్ని సందర్శించి, పూలమాల వేసి నివాళులర్పించి, ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. నివాళులు అర్పించిన వారిలో సీపీఐ గన్నవరం నియోజకవర్గ కార్యదర్శి పెద్దు వాసుదేవరావు, కాట్రగడ్డ రామచంద్ర జోషి, బందారు లక్ష్మయ్య, శనగలు సుబ్బారెడ్డి, కట్టవరపు విజయరావు, వెంగళ్ల శివయ్య, ఎన్ రాం మోహనరావు, తాటి శివరామకృష్ణ, వై నాగరాజు, ఆర్ రాజేష్, ఎన్ శంకరరావు, పడమట నరేష్, ఈగ సూరమ్మ తదితరులు ఉన్నారు.

చిన్న పరిశ్రమలకు ప్రభుత్వ ప్రోత్సాహం

విశాలాంధ్ర-మచిలీపట్నం : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పథకాల క్రింద పరిశ్రమలకు అందిస్తున్న పోత్సహకాలు అందిపుచ్చుకుని పరిశ్రమలు స్థాపించి జిల్లాలో పారిశ్రామికాభివృద్ధికి దోహదపడాలని జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా సూచించారు. డిస్ట్రిక్ట్ ఇండస్ట్రియల్ అండ్ ఎక్స్పర్ట్ ప్రమోషన్ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన శనివారం కలెక్టర్ చాంబర్లో జరిగింది. జిల్లాలో నూతనంగా స్థాపించిన పరిశ్రమలకు అనుమతులు ప్రోత్సహకాలు మంజూరు సంబంధిత అంశాలపై ఈ సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కృష్ణాజిల్లాలో పారిశ్రామికాభివృద్ధికి ఎన్నో అవకాశాలు ఉన్నాయన్నారు. బందరు పోర్టు అభివృద్ధికి ప్రభుత్వం అడుగులు వేస్తోందని, మరో వైపు అంతర్జాతీయ విమానాశ్రయం కలిగి ఉన్న జిల్లాలో ఎగుమతులు దిగుమతులకు చక్కని అవకాశాలు ఉన్నాయన్నారు. పరిశ్రమలు స్థాపించే వారికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పథకాల క్రింద రాయితీలు ప్రోత్సహాలతో పాటు సింగిల్ విండో విధానంలో అనుమతులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. చిన్న మధ్యతరహ పరిశ్రమలు స్థాపించేందుకు జిల్లాలో ధరఖాస్తు చేసుకున్న 32 మందికి పెట్టుబడి సబ్సిడి క్రింద 2.88 కోట్లు, పవర్ సబ్సిడీ, సేల్స్ ట్యాక్స్ సబ్సిడీ క్రింద 9 లక్షల రూ.లు మంజూరుకు కమిటీ ఆమోదం తెలిపింది. ప్రధాన మంత్రి ఎంప్లాయింమెంట్ గ్యారంటి పథకం క్రింద 2022-23 సం.రంలో 63 యూనిట్లకు 3.06 కోట్ల రూ.లు బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేయించగా వాటిల్లో 35 యూనిట్లు గ్రౌండింగ్ కాగా, మరో 24 మంది లబ్ధిదారులకు పరివర్తన్ ప్రోగ్రాం క్రింద బ్యాంకు రుణాలు అందించేందుకు, ప్రత్యామ్నయ జీవనోపాధి యూనిట్లు ఏర్పరచే చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జిల్లాలో పారిశ్రామిక ప్రగతి సాధించేందుకు వివిధ రంగాలలో 3 పారిశ్రామిక క్లస్టర్లను గుర్తించామని, వీటి ఏర్పాటుకు అవసరమైన భూములు గుర్తించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. అనంతరం 2023 జనవరి 3,4 తేదిల్లో విశాఖలో ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్లోబల్ ఇన్వెస్ట్మెంట్ సమ్మిట్ పోస్టర్ కలెక్టర్ విడుదల చేశారు. 2023 నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని కమిటీ సభ్యులతో కలసి కలెక్టర్ కేక్ కట్చేసి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల అధికారి ఆర్. వెంకట్రావు సభకు నివేదిక సమర్పించగా, ఏపి ఎంఎస్ఎంఈ డవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ జి. వరలక్ష్మీ, ఏపి ఐఐసి జడ్ఎం కె.ఎస్. సీతారామ్. ముడా విసి బి. శివనారాయణ రెడ్డి, డిపిఓ నాగేశ్వరనాయక్, సాంఘిక సంక్షేమశాఖ డిడి సరస్వతి, సిపిడిసిఎల్ ఈఈ భాస్కరరావు, దళిత్ ఇండియన్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ జిల్లా కో- ఆర్డినేటర్ ఎం. కిషోర్ పాల్గొన్నారు.

పాల ధర పెంపుపై హర్షం

విశాలాంధ్ర-బంటుమిల్లి : రైతు పక్షపాతిగా పేరొందిన కృష్ణా మిల్క్ యూనియన్ పాడి రైతులకు బాసటగా నిలిచేం దుకు దేశంలో ఎక్కడా లేని విధంగా 1, జనవరి 2023 నుండి పాల సేకరణ ధర లీటరుకు రూ.5 పెంచుటకు కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు, వారి పాలకవర్గ సభ్యులు నిర్ణయం తీసుకోవడం పట్ల బంటుమిల్లి మండల పరిధిలోని వివిధ సంఘాల అధ్యక్షులు శనివారం హర్షం వ్యక్తం చేశారు. ఈ పెరిగిన పాల సేకరణ ధరతో 11 శాతం వెన్న గల గేదె పాలకు రూ.85.80 పైసలు మరలా 4 నెలలకు 15 శాతం బోనస్‌తో కలిపి 11 శాతం వెన్నతో గేదె పాలకు రూ.98.67 పైసలు ధర చెల్లిండం గర్వకారణం అని అన్నారు. పాడి రైతు సంక్షేమం, పశు సంక్షేమం కింద ఈ 9 నెలల్లో రూ.10 కోట్ల ఖర్చు చేయడం, క్షీర బందు, కళ్యాణమస్తు, ప్రతిభ వంటి పథకాలు, పశు పోషణలో మెళకువలు మేలైన యాజమాన్య పద్ధతులు గురించి, పాడి రైతులకు తెలిపారు. చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన తరువాత రూ.22 ధర పెంచడంలో రైతు బాంధవుడిగా పేరుపొందిన కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు, వారి పాలకవర్గ సభ్యులకు, మేనేజింగ్ డైరెక్టర్ కొల్లి ఈశ్వరబాబు మల్లేశ్వరం, ముంజులూరు, కంచడం, చినపాండ్రక, రామవరపు మోడీ, మలపరాజు గూడెం సంఘాల అధ్యక్షులు పేపేటి వీరమ్మ, బసవ శ్రీను వెంకట సుబ్బారావు, పాపాని ప్రసాదరావు, అబ్దుల్ వాజిద్, గూడవల్లి రాంబాబు, పుప్పాల శేషగిరిలు కృతజ్ఞతలు తెలిపారు.

నాటు సారా రహిత జిల్లాగా ...

విశాలాంధ్ర-మచిలీపట్నం : అక్రమ మార్గాల ద్వారా మద్యం బాటిల్లను రవాణా చేస్తూ ఎక్సైజ్ కేసుల్లో సీజ్ చేసిన మద్యం బాటిళ్లను మొత్తం 686 కేసుల్లో 24211 మద్యం సీసాలు, 234 కేసుల్లో 1478 లీటర్ల నాటుసారా జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో ధ్వంసం చేశారు. ఎక్సైజ్, ప్రొహిబిషన్ కేసులలో మొత్తం 119 వాహనాలను సీజ్ చేసి వాటికి బహిరంగ వేలంపాట నిర్వహించి, రూ.41 లక్షల ఆదాయం ప్రభుత్వ ఖజానాకు జమ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో నాటు సారాను సమూలంగా నిర్మూలించేందుకు ఆపరేషన్ పరివర్తన 2.0 కార్యక్రమాన్ని నిర్వహించి ,విస్తృత మెరుపు దాడులు నిర్వహించడమే కాక, అవసరం మేరకు వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలకు ఉపక్రమిస్తూ, గ్రామాల్లో నాటు సారాయిని పూర్తిస్థాయిలో అదుపు చేయగలిగామని, నాటు సారా తయారు చేస్తూ కేసులలో చిక్కుకున్నప్పటికీ మార్పురాని 5 మందిపై పి డి యాక్ట్ అమలు పరచడం జరిగిందని, అంతేకాక నాటు సారా తయారీ చేస్తున్న 57 కుటుంబాలకు చెందిన పాత నేరస్తులను గుర్తించి వారికి ప్రత్యామ్నాయ జీవనోపాధి కల్పనలో భాగంగా వివిధ ప్రభుత్వ శాఖల నుండి రుణాలు మంజూరు చేసి వారి కుటుంబాల్లో నూతన వెలుగులను నింపడం జరిగిందని అన్నారు. ఎక్సైజ్ ,ప్రొహిబిషన్ కేసులలో సీజ్ చేయబడిన మద్యం బాటిల్లను, నాటు సారాను ధ్వంసం చేయడం జరిగింది. బంగారు భవిష్యత్తును పొందాల్సిన యువత మద్యం మత్తులో చిక్కుకొని వారి జీవితాలను చిదుముకోవద్దని, మద్యం సేవించడం వలన జరిగే అనర్థాలను తెలుసుకొని జాగ్రత్తగా ఉండాలని, అలాగే కృష్ణా జిల్లాను నాటు సారా రహిత జిల్లాగా మార్చడానికి ఇప్పటివరకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నాటు సారా తయారీలో 0 కేసులు నమోదు చేస్తూ రాష్ట్రంలోనే కృష్ణాజిల్లా మొట్టమొదటి సారా రహిత జిల్లాగా పేరు పొందేల ప్రతి ఒక్క పోలీస్ అధికారి సిబ్బంది కృషి చేయాలని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో ఇంచార్జ్ అడిషనల్ ఎస్పి ఎన్ వెంకట రామాంజనేయులు,సబ్ డివిజన్ల డీఎస్పీలు, పోలీస్ మరియు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ స్థాయి త్రోబాల్ పోటీలకు

విజయ క్రాంతి విద్యార్థిని

విశాలాంధ్ర-చల్లపల్లి : జాతీయ స్థాయి పోటీలకు చల్లపల్లి విజయ క్రాంతి జూనియర్ కళాశాల విద్యార్థిని ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ దుట్టా శివరామ్ ప్రసాద్ తెలిపారు. కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న సాయిదుర్గ త్రోబాల్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. డిసెంబరు 22, 23 తేదీల్లో విశాఖపట్నంలో జరిగిన రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి విజయం సాధించటంతో జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శివరామ్ ప్రసాద్, పీఈటీ ప్రేమ్బాబు, అధ్యాపకులు సాయిదుర్గను అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, తమ కళాశాలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ సత్తాచాటి రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలకు ఎంపికకావటం గర్వకారణంగా ఉందన్నారు.

మండవ బాబురావు వర్ధంతి

విశాలాంధ్ర-కూచిపూడి : ప్రవాస భారతీయులు మొవ్వ గ్రామ నివాసి మండవ బాబూ రావు 7వ వర్ధంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. మొవ్వ గ్రామ పంచాయతీ ఆవరణలోని ఆయన విగ్రహానికి మాజీ సర్పంచ్ మండవ బాల త్రిపుర సుందరి పూలమాల వేసి నివాళులర్పి స్తూ బాబూరావు గ్రామానికి అందించినసాయాన్ని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మండవ రామమోహనరావు, పంచాయతీ వార్డు సభ్యురాలు మండవ బేబీ సరోజిని, మాజీ సర్పంచ్ సంకుల కోటేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ మండవ రత్నగిరిరావు, టిడిపి మండల అధ్యక్షుడు మండవ కృష్ణ, తదితరులు నివాళులర్పించారు..

మొవ్వ మండల యూటీఎఫ్ కార్యవర్గం ఎన్నిక.

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ మండల యుటిఎఫ్ ఎన్నికలు శనివారం కూచిపూడి లో నిర్వహించారు. ఆ యూనియన్ గౌరవాధ్యక్షులుగా విశ్రాంతి ఉపాధ్యాయుడు, కార్యదర్శిపాగోలు రమేష్ బాబు, అధ్యక్షులుగా ఎం రత్నగిరి రావు ఉపా ధ్యక్షులుగా వైవి సతీష్, ఉపాధ్యక్షురాలుగా కె నిర్మల, ప్రధాన కార్యదర్శిగాఎం శివ కుమార్, కోశాధికారిగా కె శివ నాగరాజు, కార్యదర్శులుగా బీహెచ్ చంద్రశేఖర రావు, ఏ విఠల్ ప్రసాద్ ,పి.బి శ్రీనివాసరావు , పి సురేష్ బాబు, బి బేబీ కుమారి,ఎం లక్ష్మీ మంజూష, బి చెన్నకేశవ, ఆడిటర్.గా కె బ్రహ్మం ఎన్నికయ్యారు. అలాగే జిల్లా కౌన్సిలర్లుగా కే చింతయ్య. ఎం అనురాధ, ఎం రవీంద్రబాబు ఎన్నికయ్యారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి కనకారావు, ఎన్ వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు పరిశీలించిన ఎంపీడీఓ

విశాలాంధ్ర-గుడివాడ : గుడివాడ రూరల్ మండలంలోని రామన్నపూడి గ్రామ సచివాలయం పరిధిలోనీ ఆర్‌బికె సెంటర్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎంపీడీవో వెంకటరమణ శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల పై చర్చించి వాటి పరిష్కార మార్గాలను ఫీల్డ్ సిబ్బంది సమక్షంలో సూచించారు. అనంతరం జగనన్న హౌసింగ్ లేఅవుట్లు పరిశీలించి, గృహ లబ్ధిదారులతో సమావేశం ఏర్పాటు చేసి త్వరితగతిన ఇండ్లు నిర్మించుకోవలని చూచించారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా పని చేయటమే లక్ష్యం

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా అన్నివర్గాలకు సామాజిక న్యాయం చేయగలిగే సత్తా ఒక్క మహాజన సోషలిస్ట్ పార్టీకి(ఎమ్.ఎస్.పి) మాత్రమే ఉందని దానిని ప్రజల్లోకి తీసుకువెళ్ళవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఉమ్మడి జిల్లా సమన్వయకర్త మంద వెంకటేశ్వరరావు,ఉమ్మడి జిల్లా కో-కన్వీనర్ మానికొండ శ్రీధర్ తెలిపారు. శనివారం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో నిర్మాణం జరిగిన ఎమ్.ఎస్.పి పార్టీ ప్రధాన భూమిక పోషిస్తుందన్నారు. విజయవాడ అర్బన్ నియోజకవర్గాల కన్వీనర్లను తాత్కాలికంగా నియమించారన్నారు. విజయవాడ అర్బన్‌కు కన్వీనర్‌గా లింగాల నరసింహులు,కో-కన్వీనర్‌లుగా బొడ్డు కిషోర్ మాదిగ, కాంపాటి వెంకటేశ్వరరావు,పశ్చిమ నియోజకవర్గానికి కన్వీనర్‌గా ఇసుకపల్లి చిట్టిబాబు,కో-కన్వీనర్లుగా మాతంగి సంజయ్, దూడల నరసింహారావు, సెంట్రల్ నియోజకవర్గం కన్వీనర్‌గా నూకపోవు ఏసు, కో-కన్వీనర్లుగా చప్పిడి కాశి, వంగూరి ప్రకాష్, తూర్పు నియోజకవర్గం కన్వీనర్‌గా మామిడి రాంబాబు,కో-కన్వీనర్లుగా వంకాయలపాటి రాజేష్, వంగూరి వెంకన్న నియమించటం జరిగిందన్నారు

చిన్న పత్రికలపై చిన్న చూపు తగదు

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : పెద్ద పత్రికలు చిన్న పత్రికలనే తారతమ్యం ఏమీ లేదని, పెద్ద పత్రికల కంటే చిన్నపత్రికల్లోనే స్వేచ్ఛాయుత వార్తలు ప్రచురితమవుతాయని ఐజేయూ ఉపాధ్యక్షులు అంబటి ఆంజనేయులు అన్నారు. ప్రజాభిప్షం పత్రిక రూపొందించిన 2023 నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం శనివారం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైలేజ్, సర్కులేషన్, జీఎస్టీ వంటి ఆంక్షలతో ఐ.అండ్.పి ఆర్ డిపార్ట్మెంట్ చిన్న పత్రికలకు అడ్వర్టైజ్మెంట్ ఇవ్వకుండా నిరాకరిస్తుందని ఆరోపించారు. ఇది సరైన విధానం కాదన్నారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అనేక సంక్షేమ కార్యక్రమాలను చిన్న పత్రికల్లోని ఎక్కువగా ప్రచురితమవుతాయని, ప్రజా సమస్యలు కూడా ఆపత్రికలో రావటంతో సమస్యలను సత్వరమే పరిష్కరించే వీలు ఉంటుందన్నారు. ప్రభుత్వం పెద్ద మనసుతో ఆలోచించి చిన్న పత్రికలను ప్రోత్సహించాల్సిన అవసరాన్ని గుర్తించాలన్నారు. పెద్ద పత్రికల్లో పని చేసిన వారు చిన్న పత్రికలను పెట్టుకుని సమాజ సేవలో తమ వంతు పాత్ర పోషిస్తున్నారని గుర్తు చేశారు. అనేక ఆటుపోట్లు నడుమ అష్ట కష్టాలు పడుతూ పత్రికలను నడుపుతూ వృత్తి ధర్మాన్ని నెరవేరుస్తున్న పాత్రికేయులను అభినందించాలన్నారు. ప్రస్తుత ప్రజాభిప్షం పత్రిక సంపాదకులు ఎంవి సుబ్బారావు గతంలో ఆంధ్రజ్యోతి దినపత్రికలో రిపోర్టర్‌గా పనిచేసి రైల్వే సుబ్బారావుగా గుర్తింపు తెచ్చుకున్నారని కొనియాడారు. సద్విమర్శలతో ఆయన వార్తలు ఉంటాయని అందువల్లే ఆయన పట్ల అటు అధికారులకు, ఇటు రాజకీయ నాయకులకు అందరికీ గౌరవ భావం పెరిగిందని ప్రశంసించారు. ఫిలిం ఛాంబర్ కార్యదర్శి ముత్యాల రమేష్ గౌరవ అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రస్తుత తరుణంలో క్యాలెండర్‌ను అందంగా తీర్చిదిద్దటం అభినందించారు. పత్రిక సంపాదకులు ఎంవి సుబ్బారావు మాట్లాడుతూ డిజిటల్ మీడియా, సోషల్ మీడియా విజృంభిస్తున్న తరుణంలో కూడా అందమైన రంగుల క్యాలెండర్ ప్రతి సంవత్సరం ఆవిష్కరిస్తున్నానని చెప్పారు.

ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు ఐజేయు కౌన్సిల్ సభ్యులు ఎస్.కె బాబు, స్టేట్ స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ రమణారెడ్డి, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు నిమ్మరాజు చలపతిరావు, ఏపీయూడబ్ల్యూజే కృష్ణ అర్బన్ యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు చావారవి, కొండా రాజేశ్వరరావు, ప్రెస్ క్లబ్ కార్యదర్శి వసంత్, ఏపీయూడబ్ల్యూజే కౌన్సిల్ సభ్యులు రామారావు, దారం వెంకటేశ్వరరావు, దాసరి నాగరాజు, సీనియర్ జర్నలిస్టు రాజారావు, శ్రీనివాస్ (జన జ్వాల), ప్రెస్ క్లబ్ కోశాధికారి హుస్సేన్, యూనియన్ కోశాధికారి బీ.వి శ్రీనివాస్, ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సాంబశివ రావు, యూనియన్ నాయకుడు రఘు, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యకరమైన పోటీలతో

మానసిక వికాసం

విశాలాంధ్ర-విజయవాడ(వన్‌టౌన్) : ఏ రంగంలోనైనా ఆరోగ్యకరమైన పోటీలలో పాల్గొనే విద్యార్థులు మానసికంగా చైతన్యవంతం అవుతారని తాడిగడప మున్సిపల్ కమిషనర్ డాక్టర్ ఎన్. ప్రకాశరావు అన్నారు. ఎనికేపాడు లోని శ్రీ విజ్ఞాన విహార ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శనివారం జరిగిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వ్యాసరచన, ఫోటోగ్రఫీ, మూకాభినయం, తెలుగు పద్యం, సమాజ పోకడలపై చర్చా వేదిక వంటి అంశాలతో పాటు పరుగు పందెం, ఖో ఖో, కబడ్డీ, షటిల్ బ్యాడ్మింటన్ వంటి క్రీడలలో గెలుపొందిన విజేతలకు అతిథులు బహుమతి ప్రదానం చేశారు. విజ్ఞానవిహార ఎడ్యుకేషనల్‌సొసైటీ అధ్యక్షులు బివిఎస్‌టి సాయి, సొసైటీ కార్యదర్శి గోవిందరావు, ప్రధాన అధ్యాపకురాలు బి. సీతామహాలక్ష్మి, ఉప ప్రధాన అధ్యాపకురాలు జి. శైలజ ఉన్నారు.

విద్యార్థులు సేవా భావంతో మెలగాలి

విశాలాంధ్ర-అవనిగడ్డ : విద్యార్థులు సేవాభావంతో మెలగాలని ప్రోగ్రాం ఆఫీసర్ కుమారి పిలుపునిచ్చారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. 2022 సంవత్సరానికి ముగింపు పలుకుతూ నూతన సంవత్సరం కళాశాల ఆవరణ పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కె.వి శాంత కుమారి స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో బచ్చు ఆదినారాయణరావు, కళాశాల సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలకు క్రీడా పరికరాలు అందజేసిన పూర్వవిద్యార్థులు

విశాలాంధ్ర-గన్నవరం : క్రీడా పరికరాలు అందజేసిన పాఠశాల పూర్వ విద్యార్థి చదువుతోపాటు ఆటపాటలు కూడా ముఖ్యమేనని... విద్యార్థుల సమగ్రాభివృద్ధికి పూర్వ విద్యార్థులమైన తమ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని పాఠశాల పూర్వ విద్యార్థులు బీబీ గూడెం చెందిన గుజ్జర్లపూడి వెంకటేశ్వరరావు, తమ్మిశెట్టి రఘుబాబు పేర్కొన్నారు. దాతలు అందించిన క్రీడా పరికరాలను విద్యార్థులకు బహూకరించి వాలీబాల్ ప్రదర్శన మ్యాచ్ ను తిలకించి విద్యార్థులను అభినందించారు.

వేదవ్యాస్ సుడిగాలి పర్యటన

విశాలాంధ్ర-పెడన : తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్ కృత్తివన్ను మండలంలో సుడిగాలి పర్యటన చేశారు. నీలి పూడి కొమాళ్ళ పూడి గ్రామాలలో ఇటీవల ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలను పరామర్శించారు. గత కొద్దిరోజులుగా అనారోగ్యం తో ఉన్న వేదవ్యాస్ కోలుకుని గ్రామాల పర్యటన చేపట్టారు. పట్టపు నాగబాబు గ్రామ సర్పంచ్ పాశం కృష్ణ పాశం సుబ్రహ్మణ్యం ఎక్స్ ఎంపీపీ వలవాలా సత్యనారాయణ పుప్పాల నరసింరావు పుప్పాల రంగారావు పుప్పాల చిట్టి బాబు ఎక్స్ సర్పంచ్ చిన్న జంపాన కోటయ్య చిట్టిబాబు బాబీ తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

'యువగళం' విజయవంతం చేయండి

విశాలాంధ్ర-కోడూరు : తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ జనవరి నెల 27వ తేది నుండి యువగళం పేరుతో చేపటనున్న పాదయాత్రను విజయవంతం చేయాలి కోడూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బండే శ్రీనివాసరావు కోరారు.ఈ సందర్భంగా స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో విలేఖరుల సమావేశములో ఆయన మాట్లాడుతూ నారా లోకేష్ జనవరి నెల 27వ తేది నుండి 100 పైగా నియోజకవర్గలలో 400 రోజులు నాలుగువేల కిలోమీటర్లు యువగళం పేరుతో పాదయాత్ర చేపటబోతున్నారు అని ఈ యాత్రను తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సానుభూతిపారులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలి అని తెలిపారు. కందుకూరు ఘటనలో చనిపోయిన వారికి రెండు నిమషాలు మౌనం పాటించి నివాళ్ళు అర్పించారు.అనంతరం మెరకగౌడపాలెం లోని నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలలు వేసారు. ఈ కార్యక్రమంలో గుడిశేవ సూర్యనారాయణ, తోట వెంకట రాంబాబు, తోట సాంబశివరావు, బడే వీరబాబు, బడే వీర గాంధీ,బొడ్డు వెంకటేశ్వరరావు, ఉప్పాల పోతురాజు, కొక్కిలిగడ్డ జాన్‌విల్సన్, బండే వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

డిజిటల్ విప్లవానికి అంకురార్పణ

విశాలాంధ్ర-గూడూరు: కప్పలదొడ్డిలో శనివారం రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న బైజూస్ కాంటెంట్ తో ఉన్న టాప్స్ ని కప్పలదొడ్డి గ్రామం జిల్లా పరిషత్ స్కూల్లో చదువుతున్నటువంటి 66 మంది ఎనిమిదో తరగతి విద్యార్థి విద్యార్థులకు టాబ్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ యక్కల మాధవి నాగరాజ్, ఎంపీటీసీ తేజవతి మధు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ యక్కల రమేష్, వైస్ చైర్మన్, గ్రామ కన్వీనర్లు. స్కూల్ హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాణ్యమైన ఉన్నత విద్యకు పెద్దపీట వేస్తూ, స్కూల్స్ ఆధునికరిస్తూ , డిజిటల్ విద్యకు ప్రాధాన్యత ఇస్తూ, భవిష్యత్ తరాలు దేశ లెవల్లో కాంపిటేటివ్ పరీక్షల్లో ఉన్నత శిఖరాల్లో నిలవాలని ఆశిస్తున్న సీఎం జగన్, మంత్రి జోగి రమేష్‌కు అభినందనలు తెలిపారు.

విశాలాంధ్ర
ఎన్టీఆర్ జిల్లా

సింగ్‌నగర్ ఎక్సెల్ ప్లాంట్‌లో ఘోర ప్రమాదం

జేసీబీ తగిలి డ్రైవర్ మృతి

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్) : విజయవాడ సింగ్‌నగర్ ఎక్సెల్‌ప్లాంట్‌లో శనివారం జరిగిన ప్రమాదంలో చక్క రాజేష్(26) మృతి చెందారు. పోలీసుల తెలిపిన సమాచారం ప్రకారం ప్రకాష్‌నగర్‌కు చెందిన చక్క రాజేష్ నగరపాలక సంస్థ డంపింగ్‌యార్డ్‌లో మినీ ప్రొక్లెన్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. విధినిర్వహణలో భాగంగా ప్రొక్లెన్ నడుపుతున్న సమయంలో రోడ్డుపై గాజుపెంకులు కనిపించాయి. వాటిని పక్కకు తీసే క్రమంలో అతని కాలికి కూడా గాజు పెంకులు గుచ్చుకున్నాయి. వాటిని జాగ్రత్తగా బయటకు తీస్తున్న సమయంలో పైకి ఎక్కిపెట్టిన ఉన్న యంత్రం ఒక్కసారిగా కిందకు పడింది. ప్లొకెన్ కిందే ఉన్న రాజేష్ ముఖానికి బలంగా తగలటంతో అతను అక్కడిక్కడే మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతిపక్షాల ఆందోళన:

ప్లొకెన్ ప్రమాదంలో రాజేష్ అనే వ్యక్తి మృతి చెందిన సమాచారాన్ని అందుకున్న ప్రతిపక్ష నాయకులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. రాజేష్‌కు నాలుగు నెలల క్రితమే వివాహం అయింది. ఇంతలోనే చిన్న వయసులో రాజేష్ మృతి చెందటం బాధకరం అన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన రాజేష్ కుటుంబానికి 25లక్షల రూపాయలు నష్టపరిహారం, ఆ కుటుంబానికి ఇల్లు ఇవ్వాలని ఆందోళన చేపట్టారు. నగర పాలక సంస్థ మేయర్, మున్సిపల్ కమీషనర్ బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి రూ.10లక్షలు ఇల్లు ఇచ్చేందుకు కృషి చేస్తామని నగర పాలక సంస్థ అధికారులు హామి ఇవ్వటంతో ఆందోళన విరమించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆందోళన చేపట్టిన వారిలో సీపీఐ నగర కార్యదర్శివర్గ సభ్యులు కేవీ.భాస్కరరావు, టీడీపీ నాయకులు నవనీతం సాంబశివరావు, గొట్టుముక్కల రఘు, దాసరి ఉయదశ్రీ, సీపీఐ రాష్ట్ర నాయకులు సీహెచ్.బాబూరావు తదితరులు ఉన్నారు.

జిల్లాను అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలపాలి

కలెక్టర్ ఢిల్లీరావు

విశాలాంధ్ర-విజయవాడ : జిల్లాను అన్ని రంగాల్లోనూ అగ్రగామిగా నిలిపేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకువెళుతున్నామని ఇందుకు ప్రతీ ఒక్కరి సహకారం అవసరమని జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీ రావు అన్నారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని శనివారం జిల్లా కలెక్టర్ ఢిల్లీ రావు మీడియా ప్రతినిధులతో అయన కార్యాలయంలో ఇష్టాగోష్టి నిర్వహించారు. మీడియా ప్రతినిధులతో అయన మాట్లాడుతూ జిల్లాల పునః వ్యవస్తీకరణ నేపథ్యంలో ఏర్పడిన ఎన్టీఆర్ జిల్లాను అభివృద్ధి పథంలో నిలిపేందుకు అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధుల సహకారంతో తనవంతు కృషి చేస్తున్నానన్నారు. ఈ ఏడాది నిర్దేశించుకున్న లక్ష్యాలను సాదించగలిగామన్నారు. ఇందులో ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, మీడియా ప్రతినిధులు అందించిన సలహాలు, సూచనలు తనకెంతగానో ప్రేరణ కల్పించామన్నారు. ఇదే స్పూర్తితో రానున్న నూతన సంవత్సరం మరింత అభివృద్ధి పథంలో జిల్లాను అగ్రగామిగా నిలిపేందుకు సమిష్టిగా కృషి చేస్తున్నామన్నారు. గత ఏడాది అభివృద్ధి సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతీ లబ్దిదారునికీ చేరువు చేశామన్నారు. ప్రజాసమస్యల పరిష్కార వేదిక స్పందన ద్వారా ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరిస్తున్నామన్నారు. జిల్లాలో ప్రత్యేకంగా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమంపై ప్రత్యేక దృష్టి పెట్టమని దీనిలో భాగంగా గర్భిణీ స్త్రీలు, బాలింతలు, చిన్నారులలో రక్తహీనతను నివారించి ఆరోగ్యకర సమాజాన్ని తీర్చిదిద్దుతున్నామన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఎలక్ట్రానిక్ వేస్ట్, వ్యర్థ పదార్ధాల సక్రమ నిర్వహణ, రీ సైక్లింగ్ వంటి పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఏ. కొండూరు కిడ్నీ వ్యాధులకు సంబంధించి సానుకూల దృక్పథంతో ముందుకు వెళుతున్నామన్నారు. వ్యాధి తీవ్రత నిర్ధారించే క్రియాటిన్ స్థాయి 5 కన్నా ఎక్కువగా 120 మందికి పైగా ఉన్నట్లు గుర్తించామన్నారు. వ్యాధికి ప్రధానంగా నీటిలో మెటల్ సిలికా, ఫ్లోరైడ్ కారణం కావచ్చునని నిపుణులు సూచించారన్నారు. శుద్ధి చేసిన నీటిని టాంకర్ ల ద్వారా సరఫరా చేస్తున్నామని ఆనీటిని త్రాగునీటి అవసరాలతో పాటు వంటకు వినియోగించేలా ప్రజలకు అవగాహన కల్పించామని కలెక్టర్ ఢిల్లీ రావు అన్నారు. ఇష్టాగోష్టి కార్యక్రమంలో కలెక్టర్ తో పాటు జిల్లా ఉప కార్యనిర్వహక సమాచార ఇంజినీర్ యు. సురేంద్రనాథ్, జిల్లా సమాచార పౌరసంబంధాల అధికారి ఎస్. వి. మోహన్ రావు, సమాచార శాఖ ప్రచార సహాయకులు వేమూరి వర ప్రసాద్‌లు ఉన్నారు.

మా జీవితాలు రోడ్డున పడ్డాయి

విశాలాంధ్ర-వీరులపాడు: మండల కేంద్రాన్ని తరలిస్తే మా పరిస్థితి ఏంటి అని చిరు వ్యాపారాలు ప్రశ్నిస్తున్నారు. మండల కేంద్రాన్ని నమ్ముకుని చాలామంది చిరు వ్యాపారులు జీవనం కొనసాగిస్తున్నారు. చిన్న చిన్న హెూటల్స్, బడ్డీకొట్లు, పండ్ల వ్యాపారులు, కిరాణా వ్యాపారులు, సెల్ఫోన్ షాపులు, ఫోటో స్టూడియోలు, జిరాక్స్ సెంటర్లు, చేతివృత్తుల వారు అనేకమంది మండల కేంద్రంను నమ్ముకుని జీవనం కొనసాగిస్తున్న వారందరూ 16 రోజు రిలే నిరాహార దీక్షలో శనివారం పాల్గొన్నారు. మండల పోరాట కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న చిరు వ్యాపారులు ముక్తకంఠంతో మండల కేంద్రం తరలింపును వ్యతిరేకించారు, తమ జీవితాలు రోడ్డున పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రిలే నిరాహార దీక్షలో అద్దంకి వెంకటేశ్వర్లు, గుడిసె బుల్లోడు, గుడిసె బిక్షం, పెరుమాళ్ళపల్లి పుల్లయ్య, ఉప్పు మధుసూదనరావు, కర్లకుంటి ముక్కంటి, అద్దంకి చిన్నోడు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై పోరాటం చేయాలి

సీపీఐ తిరువూరు నియోజకవర్గ కార్యదర్శి షేక్ నాగూల్‌మీరా

విశాలాంధ్ర-గంపలగూడెం : తిరువూరు నియోజకవర్గంలో ముఖ్యమైన సమస్యలపై భారత కమ్యూనిస్టు పార్టీ తరపున తిరువూరు నియోజకవర్గంలో పోరాటం చేయాల్సిన అవసరం ఉన్నదని సీపీఐ తిరువూరు నియోజకవర్గ కార్యదర్శి షేక్.నాగుల్‌మీరా తెలిపారు. నూతన సంవత్సరం సందర్భంగా శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడారు. తిరువూరు పట్టణంలోని టీడ్కో గృహ సమస్యలపై పరిష్కారం కోసం, గంపలగూడెం మండలం వినగడప తండా సమీపంలో ఉన్న ప్రభుత్వ భూమికి సాగు చేసుకున్న లబ్ధిదారులకు పట్టాలివ్వాలని, మండలంలోని చెన్నవరం గ్రామంలో సాగులో ఉన్న ప్రభుత్వ భూమికి సాగు చేసుకుంటున్న లబ్ధిదారులకు పట్టాలి వ్వాలన్నారు. విసన్నపేట పంచాయతీలో ఇళ్ల స్థలాల సమస్య, ఏ కొండూరు మండలంలో ఫ్లోరైడ్ వాటర్ సమస్యపై శాశ్వత చర్యలు, నియోజకవర్గంలోని అంతర్గత రోడ్ల అభివృద్ధి, కట్టలేరు వాగుపై తోటమూల సమీపంలో హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణం, తిరువూరు పట్టణంలో ప్రభుత్వ సాంకేతిక కళాశాల స్థాపించడం గురించి, హైదరాబాదుకు ఉదయం బస్ సర్వీసులు గురించి, తిరువూరు నియోజకవర్గంలో ప్రభుత్వ పీజీ కళాశాలను స్థాపించాలే పోరాటం చేయాలని నాగుల్‌మీరా కోరారు. తిరువూరులో ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాల ప్రారంభించి, తిరువూరు నియోజకవర్గంలోని అన్ని మేజర్ పంచాయతీలలో డ్రైనేజీ సమస్య పరిష్కరించేందుకు కార్యకర్తలు కృషి చేయాలని అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా భారత కమ్యూనిస్టు పార్టీ దేశ రాష్ట్ర జిల్లా నాయకులకు, తిరువూరు నియోజకవర్గ కార్యకర్తలకు తిరువూరు నియోజకవర్గ సమితి తరపు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ తిరువూరు మండల కమిటీ కార్యదర్శి ఎస్ వనమాలి, పట్టణ కార్యదర్శి కొత్తపల్లి సుందరరావు, సీపీఐ గంపలగూడెం మండలం కార్యదర్శి ఉన్నం సాంబశివరావు, విసన్నపేట మండల కార్యదర్శి మర్పకట్ల త్యాగరాజు, ఏ కొండూరు మండల కార్యదర్శి మేకల డేవిడ్, గంపలగూడెం గ్రామ కార్యదర్శి గౌర్రాజు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు అధిక ప్రాధాన్యత

విశాలాంధ్ర-తిరువూరు: తిరువూరు పట్టణంలో అభివృద్ధి పనులకు ప్రాధాన్యత అధిక ఇస్తున్నట్లు నగర పంచాయతీ చైర్పర్సన్ గత్తం కస్తూరిబాయి తెలిపారు. శనివారం నగర పంచాయతీ అత్యవసర సమావేశం జరిగింది. గోతులు మయమైన రహదారుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని సభ్యులు కోరగా, త్వరలోనే సిసి రహదారుల నిర్మాణం చేపడతామని చైర్పర్సన్ తెలిపారు. గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో గుర్తించిన పనుల నిర్వహణకు నిధులు మంజూరయ్యాయని, పారదర్శకంగా పనులు చేపడుతామని వెల్లడించారు. కోతులు, కుక్కలు, పందుల బెడద నివారించాలని, మంచినీటి పైప్లైన్ల నిర్మాణానికి తవ్విన రహదారులు పునర్నిర్మించాలని కౌన్సిలర్లు కోరారు. పట్టణంలోని దారా పూర్ణయ్య టౌన్షిప్‌లో సామాజిక అవసరాలకు కేటాయించిన స్థలాన్ని ప్రజోపయోగానికి వినియోగించాలని కౌన్సిలర్లు విజ్ఞప్తి చేశారు. ఇన్ చార్జ్ కమిషనర్ వెంకటేశ్వరరావు, వైఎస్ చైర్ పర్సన్ లు వెలుగోటి విజయలక్ష్మి, గుమ్మ కోటేశ్వరి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

సిద్ధార్థ పాఠశాలలో నూతన సంవత్సర వేడుకలు

విశాలాంధ్ర-విజయవాడ : మొగల్రాజపురంలోని వీరమాచనేని పద్దయ్య సిద్దార్థ పాఠశాలలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఒకటి రెండు తరగతుల చిన్నారులు ప్రదర్శించారు. నూతన సంవత్సర స్వాగత ప్రసంగం, జానపద, ఆధునిక నృత్యాలు, భగవద్గీత శ్లోకాలు, భిన్నత్వంలో ఏకత్వాన్ని తెలిపే భారతీయ సాంప్రదాయ వేషధారణలు , వివిధ రకాల గీతాలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సంచాలకులు మేడా సీతారామయ్య ,ఉపసంచాలకులు రోజు మేరీ ప్రధానోపాధ్యాయురాలు సిహెచ్ జయలక్ష్మి పాల్గొని వ్రాత పరీక్షలో వివిధ పోటీలలో ప్రతిభ కనపరిచిన విద్యార్థులను అభినందించి బహుమతులను అందజేశారు. విద్యార్థులందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

కేఆర్ఎంబీ కార్యాలయం విజయవాడలో ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: కృష్ణాజలాలను ఇరు తెలుగు రాష్ట్రాలకు పంపిణీ చేసేందుకు నిర్ణయించిన కృష్ణా నదీజలాల పంపిణీ సంస్థ(కేఆర్ఎంబీ) కార్యాలయాన్ని విజయవాడలోనే ఏర్పాటు చేయాలని సీపీఐ(ఎంఎల్)లిబరేషన్ జిల్లా కార్యదర్శి డి.హరినాథ్ డిమాండ్ చేశారు. పాలేరు రిజర్వాయర్ నుంచి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో విడుదలవుతున్న కృష్ణాజలాలను మొదటి, రెండవ జోన్లు ఉన్న తెలంగాణా, మూడవజోన్ ఉన్న ఆంధ్రప్రాంతానికి వాటాల ప్రకారం పంపిణీ చేసేందుకు తొలుత ఈ సంస్థను హైదరాబాదులో ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. రాష్ట్ర విభజన నేపథ్యంలో కృష్ణాజలాలు మన రాష్ట్రంలో ప్రవేశించే మూడవజోన్ ప్రవేశమార్గం ఎన్టీఆర్ జిల్లాలో ఉండగా, వీటి సరఫరా మొత్తం కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాల్లోని పలు ప్రాంతాలకు సరఫరా జరుగుతోందన్నారు. ఇక్కడ జరిగే నీటి విడుదల, సాగర్ కాలువల మరమ్మత్తులకు సంబంధించిన నిర్ణయాలు తీసుకునే కార్యాలయాన్ని రాష్ట్ర ప్రభుత్వం విశాఖపట్టణంలో ఏర్పాటు చేయటం విడ్డూరంగా ఉందన్నారు. దీనికి తోడు రాష్ట్ర విభజన జరిగిన ఎనిమిదేళ్ల తరువాత విశాఖలో కార్యాలయ ఏర్పాటుకు నిర్ణయం తీసుకోవటం హాస్యాస్పదంగా ఉందని ఆయన ఎద్దేవా చేశారు.

ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ ప్రారంభం

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: జాతీయ ఉపాధిహామీ పథకం 2020-2021, 2021-22 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన పనుల సామాజిక తనిఖీ విస్సన్నపేట మండలంలో 30వ తేదీ నుంచి ప్రారంభించినట్లు ఎంపీడీవో ఎస్.వెంకటరమణ తెలిపారు. పంచాయతీరాజ్, అటవీశాఖ తదితర ఇతర అనుబంధశాఖలకు సంబంధించిన పనులను కూడా తనిఖీ చేయనున్నట్లు తెలిపారు. జనవరి 10వ తేదీ వరకు జిల్లా రీసోర్సుపర్సన్లు గ్రామస్థాయిలో ఈ పనులు నిర్వహించి, అనంతరం మండలపరిషత్తు కార్యాలయ ప్రాంగణంలో ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆమె వివరించారు.

విద్యార్థులకు ట్యాబుల పంపిణీ

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ మండలం శ్రీ పీకేటీ నరసారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 58 మంది8వ తరగతి పిల్లలకు జడ్పిటిసి రాజులపాటి పార్వతి చేతుల మీదగా ప్రభుత్వం సరఫరా చేసినట్యాబ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం బండి రమాదేవి, సర్పంచ్ కొడాలి భవాని, ఉప సర్పంచ్ మంద శ్రీనివాస రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు ఎల్లమల్లి కుటుంబరావు, పేకేటి వెంకటలక్ష్మిలు, పేరెంట్స్ మానిటరింగ్ కమిటీ చైర్మన్ ఈశ్వరి, గ్రామస్తులు ప్రజాప్రతినిధులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేటి నుంచి 8,695 మందికి పింఛన్ల పంపిణీ

విశాలాంధ్ర-కూచిపూడి : నూతన సంవత్సరం (2023) తొలి రోజైన ఆదివారం మొవ్వ మండలంలో8,695 మందికి డాక్టర్ వైఎస్ఆర్ పెన్షన్ కానుక పంపిణీకి చర్యలు చేపట్టామని ఎంపీడీవో జి సుధా ప్రవీణ్ తెలిపారు. గత నెలలో 8463 మందికి?.2,11,89,500 లు పంపిణీ చేయగా ఈ నెల నుంచి అదనంగా కొత్త పెన్షన్ దారులు 266మందితో కలిపి 8,695 మందికి రూ.2,35,39,000 చేయుచున్నామన్నారు. మండలంలోని 16 సచివాలయాలకు సంబంధిత బ్యాంకుల ద్వారా పెన్షన్ డబ్బులు వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు ఖాతాలోశనివారం మధ్యాహ్నానికి వచ్చాయని వాటిని తీసుకొచ్చి వాలంటీర్లకు ఆ సొమ్మును అందచేయించామని తెలిపారు. సచివాలయాల వారీగా పంపిణీ చేసేపెన్షన్ వివరాలివే.. అవురిపూడి సచివాలయంలో 377, అయ్యంకిలో502, భట్ల పెనుమర్రులో545, చినముత్తేవిలో 373, కాజ-1 లో 679, కాజ-2 లో 572, కోసూరులో 926, కూచిపూడి లో 596, మంత్రి పాలెంలో384, మొవ్వ-1 లో 470, మొవ్వ-2 లో 393, నిడుమోలులో 554, పెదముత్తేవిలో617, పెదపూడిలో 699, పెదసనగల్లులో530, వేములమడ సచివాలయంలో 478 మందికి వివిధ రకాల పెన్షన్లు అందజేస్తామన్నారు. కాగా సచివాలయాలకు మంజూరైన కొత్త పెన్షన్ ప్రజా ప్రతినిధుల ద్వారా పంపిణీ చేయించగలమన్నారు.

ముఠావర్కర్స్ యూనియన్ కార్యవర్గ ఎన్నిక

విశాలాంధ్ర-తిరువూరు: ముఠా వర్కర్స్ యూనియన్ తిరువూరు మండల శాఖ మహాసభ శనివారం సుందరయ్య భవన్లో జరిగింది. నూతన అధ్యక్ష కార్యదర్శులుగా మట్టగుంజ బాబు, మరకాల ఇజ్రాయేలు, గౌరవాధ్యక్షురాలుగా వెంకటేశ్వరరావు, ఆకుల రామారావు ఎన్నికయ్యారు. సిఐటియు నాయకులు ఎస్వి భద్రం, ఆకుల రవి పాల్గొన్నారు.

పొడిబారిన కళ్లకు సకాలంలో చికిత్స

విశాలాంధ్ర-పెనమలూరు : పొడి బారిన కన్ను వ్యాధి కేవలం రోగి చూపును ప్రభావితం చేయడమే కాకుండా, వారి జీవన నాణ్యతను మరియు పని ఉత్పాదకతనుకూడా అవరోధిస్తుంది డా సౌజన్య వి. ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల కన్సల్టెంట్ ఆఫ్తల్మాలజిస్ట్ ఎల్ వి ప్రసాద్ నేత్ర వైద్యశాల అన్నారు. నగరాలలోని కార్పొరేట్ సంస్థల సిబ్బంది ఈ సమస్యకు పరీక్షలు చేయించుకోవడం మరియు సకాలంలో ఉపశమనం పొందడం ఎంతో కీలకం అని సౌజన్య తెలిపారు.

ఘనంగా ఎస్ఎఫ్ఐ 53వ ఆవిర్భావ దినోత్సవం

విశాలాంధ్ర-గుడివాడ : ఎస్ఎఫ్ఐ 53వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు పట్టణంలో పలు పాఠాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సమరం ఫెడరేషన్ జెండాను ఎగరవేసి, విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ 1970లో కేరళ రాష్ట్రంలో ఆవిర్భవించిన ఎస్ఎఫ్ఐ 53 ఏళ్ల ప్రస్థానంలో విద్యా రంగ సమస్యలపై దేశవ్యాప్తంగా నిర్వహించిన పోరాటాల ద్వారా హక్కులు సాధించుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలలో నూతన సంవత్సర వేడుకలు

విశాలాంధ్ర-తిరువూరు: మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో శనివారం నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ కార్యక్రమాలు నిర్వహించారు. మల్లేల, కోకినంపాడు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులకు రంగవల్లులు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. తిరువూరు శ్రీనిధి స్కూల్లో సాంస్కృతిక ప్రదర్శన నిర్వహించారు. నూతన సంవత్సర సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

నూతన సంవత్సరానికి ఏర్పాట్లు

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: విస్సన్నపేట మండలంలో నూతన సంవత్సర వేడుకలకు వివిధ వర్గాల ప్రజలు ఏర్పాట్లు చేస్తున్నారు. దీనిలో భాగంగా ముందస్తు ఏర్పాట్లకు అవసరమైన పూలు, మిఠాయిలు, ఫ్యాన్సీ దుకాణాలు శనివారం కిటకిటలాడాయి. తాతకుంట్ల తండా గ్రామానికి చెందిన విద్యార్థులు తమ సృజనాత్మకత జోడించి, కొత్త సంవత్సరానికి అవసరమైన శుభాకాంక్షలు తెలిపే గ్రీటింగ్‌కార్డులను స్వయంగా రూపొందించి, తమ సన్నిహితులకు అందించేందుకు సిద్ధం చేశారు.

చల్లపల్లిలో అయ్యప్పదీక్షాపరుల నిరసన

విశాలాంధ్ర-చల్లపల్లి : అయ్యప్పస్వామి, హిందూ దేవతలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బైరి నరేష్ పై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని చల్లపల్లి అయ్యప్పస్వామి క్షేత్రం ఆలయ ప్రధాన అర్చకులు భాను నంబూద్రి డిమాండ్ చేశారు. శ్రీఅయ్యప్పస్వామి పై అనుచిత వ్యాఖ్యలు చేయటాన్ని నిరసిస్తూ చల్లపల్లి నిమ్మలతోటలోని శ్రీహరిహర పుత్ర అయ్యప్పస్వామి వారి క్షేత్రంలో అయ్యప్పదీక్షాపరులు, భక్తులు శనివారం నిరసన వ్యక్తం చేశారు. అఖిల భారత అయ్యప్ప దీక్షా ప్రచార సమితి, సేవాసమితి, ఇతర సంస్థలన్నీ బైరి నరేష్ చేసిన వ్యాఖ్యలను ఖండించి ఈతరహా దాడులు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. అయ్యప్పపై చేసిన వ్యాఖ్యలు అమానుషమనీ, ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈమేరకు అయ్యప్పక్షేత్రం నుంచీ పాదయాత్రగా పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేశారు.

అర్జునరావు-మనోరమల జీవిత విశేషాలు పాఠ్యాంశంగా పెట్టాలి

విశాలాంధ్ర-విజయవాడ : దేశ స్వాతంత్ర్య పోరాటంలోనూ సంస్కరణ ఉద్యమంలో మహాత్మా గాంధీ తర్వాతి స్థానం సంపాదించిన రావూరి అర్జునరావు, మనోరమ దంపతుల జీవిత అనుభవాలను రేపటి తరం కోసం పాఠ్యాంశంగా ప్రవేశ పెట్టాలని పలువురు వక్తలు సూచించారు. ఇటీవల మరణించిన ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధులు, నాస్తికులు, సంఘసంస్కర్త రావూరి అర్జునరావు సంస్మరణసభ సర్వోదయ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక సమర యోధుల భవనంలో జరిగింది. ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు ముఖ్యవక్తగా పాల్గొన్నారు. నమ్మిన సిద్ధాంతాలు ఆశయాలకు కట్టుబడి ఉన్నారని, గోరా కుటుంబం కేవలం మాటలకే పరిమితం కాకుండా జీవితంలో ఆచరించి అందరికీ స్పూర్తిగా నిలిచారన్నారు. సమాజంలో అస్పృశ్యత నివారణ అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం పాటుపడ్డారని, స్వాతంత్ర్య ఉద్యమ తొలి రోజుల్లో జరిగిన కులాంతర మతాంతర వివాహం అర్జునరావు మనోరమ దంపతులదేనని తెలిపారు. సర్వోదయ ట్రస్టు అధ్యక్షులు జీవీ. మోహన్ ప్రసాద్ అధ్యక్షత వహించగా కార్యదర్శి మోతుకూరి వెంకటేశ్వరరావు, సాధిక్ మాట్లాడుతూ కుల రహితం ఎలాగూ సాధ్యం కాదు కాబట్టి కనీసం కుల సహితం అనే నినాదంతో ముందుకు సాగాలని అన్నారు. అవినీతి సొమ్ముకు , ఆడవారి శారీరక సుఖానికి లేని కులం అంతరించడం అసాధ్యం అన్నారు. మాట్లాడటం తెలిసిన వారితో మాట్లాడితే కలహాలు కొట్లాటలు ఉండవని,నిన్ను నువ్వు మాట్లాడుకోవాలి ప్రశ్నించుకోవాలని అర్జునరావు జీవితం ద్వారా అర్థం అవుతుందని వివరించారు. బార్ అసోసియేషన్ పూర్వ అధ్యక్షులు మట్టా జయకర్, సర్వోదయ ట్రస్ట్ ప్రతినిధులు మలినేని నారాయణ ప్రసాద్, కొత్త విజయ్ కుమార్, నియంత,చూనావ్, ఎమ్ అరుణకుమార్ పాల్గొన్నారు. తొలుత అర్జున రావు చిత్ర పటానికి నూలు దండ వేసి నివాళులు అర్పించారు.

ఆర్‌కేకు సేవా పురస్కార అవార్డు

విశాలాంధ్ర-గుడివాడ : విజయవాడ హెల్పింగ్ హాండ్స్ వార్షికోత్సవ సందర్భంగా మానవసేవే మాధవ సేవ అనే నినాదంతో పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో గుడివాడ పట్టణంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న జనసేన పార్టీ నాయకులు మాచర్ల రామకృష్ణ (ఆర్‌కె)ను సత్కరించి సేవ పురస్కారం అవార్డు అందజేయడం అభినదంనీయమాని జనసేన నాయకులు షేక్ కరీం, అయప్ప, చరణ్, మీరాషరీఫ్‌లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శుక్రవారం విజయవాడలోని హెల్పింగ్ హాండ్స్ కార్యాలయంలో జనసేన నాయకుడు ఆర్‌కెను ఘనంగా సత్కరించినట్లు తెలిపారు. గుడివాడలో పేదలకు అసరాగా నిలిచి, వృద్దులను అదుకోవడం, అనాద మృత దేహలకు దహణసంస్కరంలు, రోడ్లులను సొంత నిధులతో బాగుచేయడం, వేసవిలో త్రాగునీరు అందిచడం వంటి పలు సేవా కార్యక్రమలకు సేవా పురష్కరం అందిచడం గొప్ప విషయమన్నారు.